ఫార్మా ప్రమాదాలు నివారించండి

సీఎం చంద్రబాబుకు సీపీఐ జిల్లా కార్యదర్శి మరిపిళ్ల పైడిరాజు విజ్ఞప్తి

విశాలాంధ్ర - విశాఖ: అచ్యుతాపురం ఫార్మా సిటీలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నివారించడానికి తగిన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు సీపీఐ జిల్లా కార్యదర్శి మరిపిళ్ల పైడిరాజు విజ్ఞప్తి చేశారు. అచ్యుతాపురం ఎసెన్షియా రసాయన కర్మాగారంలో మరణించిన వారి కుటుంబ సభ్యులను కేజీహెచ్ మార్చురీ వద్ద గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు పరా మర్శించారు. ఆ సమయంలో ముఖ్యమంత్రితో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ప్రకటించిన నష్టం పరిహారం వెంటనే ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారని వెంటనే ఇప్పించాలని కోరారు. దీనికి ముఖ్యమంత్రి స్పందిస్తూ అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసి మృత దేహాలతోనే, వారి బంధువులకు నష్ట పరిహారం ఇచ్చి పంపాలని కలెక్టర్‌ని ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వ యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన చేసిన రక్షణ చర్యలు బాగున్నాయని ముఖ్యమంత్రి దృష్టికి సీపీఐ నాయకులు తీసుకెళ్లారు. భవిష్యత్తులో రసాయన పరిశ్రమల్లో ఇటువంటి సంఘటనలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని సీపీఐ తరుపున కోరారు. ప్రమాద బాధితులకు ఒక్కొక్కరికీ కోటి రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్న బాధితులకు అండగా సీపీఐ నాయకులు గురువారం విశాఖ కేజీహెచ్ మార్చురీ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఎ.విమల, సిఎన్ క్షేత్రపాల్, ఎన్.నాగభూషణం, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

అస్వస్థతకు గురైన చిన్నారులను పరామర్శించిన సీఎం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పరామర్శించారు. గురువారం విశాఖ పర్యటనలో భాగంగా కేజీహెచ్‌కు వచ్చిన ఆయన చిన్నపిల్లల వార్డును సందర్శించారు.

ఇటీవల జరిగిన ఘటనలో అస్వస్థతకు గురైన చిన్నారులను ఒక్కొక్కరిని పలకరించారు. ఒక్కో బెడ్ వద్దకు వెళ్లి ప్రతీ చిన్నారితో ప్రత్యేకంగా మాట్లాడారు. మరేం భయం లేదని.. ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో

బాధిత చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులతో మాట్లాడి వారిలో ధైర్యం నింపారు. భయపడాల్సిన పరిస్థితి లేదని, పూర్తిగా కోలుకునే వరకు అన్ని రకాలుగా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. చిన్నారులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. ఆయన వెంట స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, సీపీ, కేజీహెచ్ సూపరింటెండెంట్, వైద్యులు తదితరులు ఉన్నారు.

అప్పన్న నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదానానికి బాలాజీ హిల్స్ వ్యూ విశాఖకు చెందిన బి.రామకుమార్ మౌనిక దంపతలు రూ. 1,00,116/-లు నగదు రూపంలో పీఆర్ఓ ఆఫీసులో అన్నదానం కౌంటర్‌నందు చెల్లించి రశీదు పొందారు. వీరికి స్వామి వారి సన్నిధిలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాస మూర్తి బాండు అంద జేశారు. తదుపరి దాతకు దర్శనం అనంతరం వేద పండితులచే వేద ఆశీర్వచనం ఇచ్చి శేష వస్త్రంతో సత్కరించి ఆలయ పర్యవేక్షణ అధికారి పిల్లా శ్రీనివాసరావు స్వామివారి ప్రసాదాలను అందించారు.

నిర్లక్ష్యంగా ఉంటే జోనల్ కార్యాలయాలకు...

సిబ్బందికి వీఎంఆర్డీఏ ఎంసీ వార్నింగ్

విశాలాంధ్ర - విశాఖ: వీఎంఆర్డీఏలో ఫైళ్లు మాయం చేస్తారన్న విమర్శ గతంలో ఉండేది. రికార్డ్ గది నుంచి ఫైళ్లను బయటి వ్యక్తులకు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వీఎంఆర్డీఏ ఎంసి కెఎస్ విశ్వనాథన్ ఈ అంశాలపై దృష్టి పెట్టారు. ఇటీవల పరిపాలనా విభాగం అధికారులతో నిర్వహించిన సమీక్షలో దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. స్వయంగా తనకు ఎదురైన అనుభవాన్ని ఈ సమావేశంలో ఆయన వెల్లడించినట్టు సమాచారం. ఫైలు కనిపించడం లేదని చెబితే అప్పట్లో సంబంధిత విభాగంలో ఎవరు పని చేశారని ఆయన ప్రశ్నిస్తున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదంటూ సమీక్షా సమావేశాల్లో ఎంసీ హెచ్చరిస్తున్నారు.

వీఎంఆర్డీఏ పరిధిలో కొత్తగా విజయనగరం, అనకాపల్లి, నర్సీపట్నంలలో జోనల్ కార్యాలయాలు ఏర్పాటుకు ఎం సి నిర్ణయించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిని జోనల్ కార్యాలయాలకు బదిలీ చేయాలని ఆయన భావిస్తున్నారు. అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ ల్లో సిబ్బందికి బదిలీలు ఉండవు. రాష్ట్రంలోని అన్ని అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీలలో ఇదే పరిస్థితి ఉంది. కనీసం అర్బన్ డెవలప్ మెంట్ ల్లో పనిచేస్తున్న సిబ్బందిని బదిలీ చేయాలని గతంలో పనిచేసిన అధికారులు ప్రయత్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీలు దేనికవే స్వతంత్రంగా పనిచేస్తున్నాయి. వాటికవే ఆదాయ వనరులు సృష్టించుకుని అభివృద్ధి కార్యక్రమాలు, సిబ్బందికి జీతభత్యాలు అందజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీల సిబ్బంది బదిలీలు సాధ్యం కావడం లేదు. దీంతో కనీసం వీఎంఆర్డీఏ పరిధిలో జోనల్ కార్యాలయాలు ఏర్పాటు చేసి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ప్రదర్శించిన వారిని బదిలీ చేయాలని భావిస్తున్నారు. జోనల్ వ్యవస్థకు సంబంధించి గతంలో శ్రీకాకుళం, విజయనగరం కలెక్టర్ కార్యాలయాల్లో

జోనల్ ఆఫీసులను ఏర్పాటు చేశారు. అప్పట్లో ఈ ఏర్పాటు అంతగా ఫలితాలను ఇవ్వలేదు. ఫైళ్ళ విషయంలో పెండింగ్ ఉండకూడదని ఆయన భావిస్తున్నారు. సమీక్షా సమావేశాల్లో పెండింగ్ ఫైళ్ళ గురించి ఆరా తీస్తున్నారు. ఎంసి వరుసగా సమీక్షలు నిర్వహిస్తుండడంతో సిబ్బంది ఉక్కిరిబిక్కి అవుతున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: నగరంలో పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని జనసేన నగర అధ్యక్షులు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వార్డు అధ్యక్షులకు పిలుపునిచ్చారు. గురువారం జనసేన పార్టీ నగర కార్యాలయంలో సిటీ జనసేన పార్టీ వార్డ్ అధ్యక్షులతో నిర్వహించిన ముఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని విభాగాల కమిటీలు ఏర్పాటు చేసి, నగరంలో పార్టీని మరింత విస్తరింపజేయాలన్నారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నామినేటెడ్ పదవుల్లో కష్టపడి పనిచేసిన వారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. అనంతరం క్రియాశీలక సభ్యత్వం చేసిన 98 వార్డ్‌లలో మొదటి ముగ్గురికి, 98 వార్డులో అత్యధికంగా సభ్యత్వం చేసిన మొదటి మూడు వార్డులకు చెందిన నాయకులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జిలు బొలిశెట్టి సత్యనారాయణ, సందీప్, ప్రశాంతి, శివ ప్రసాద్ రెడ్డి, వార్డ్ అధ్యక్షులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు నడుం బిగిద్దాం

విశాలాంధ్ర - మల్కాపురం: పర్యావరణాన్ని పరిరక్షించు కోవడంలో చెట్లు ముఖ్య భూమిక పోషిస్తాయని హెచ్‌పీసీఎల్ చీఫ్ జర్మన్ మేనేజర్ ఆపరేషన్ జగదీశ్వరరావు పేర్కొన్నారు. గురువారం హెచ్‌పీసీఎల్‌లోని ఎల్ అండ్ టి సంస్థ ఐఇటిపి విభాగం ఆధ్వర్యంలో ప్రైవేట్ స్కూల్ ప్రధానమంత్రి సూచించిన అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి అనే నినాదంతో చెట్లును విద్యార్థులకు పంపిణీ చేస్తూ పలుచోట్ల మొక్కలు ఆయన చేతుల మీదుగా నాటారు. అనంతరం మాట్లాడుతూ పర్యావరణంలో మార్పులు కారణంగా ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయని ముఖ్యంగా భూగర్భ జలాలు రక్షణకు కాలుష్య రహిత వాతావరణంకి మొక్కలు విరివిగా నాటవలసిన అవసరం ఉందని అన్నారు. ఎల్ అండ్ టీ సంస్థ ఐఇటిపి విభాగం ప్రాజెక్టు మేనేజర్ శ్యాంసుందర్, ప్రాజెక్ట్ మేనేజర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మా క్షతగాత్రులను పరామర్శించిన బొండా

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో జరిగిన దుర్ఘటనలో ఎనిమిది మందిని వడ్లపూడిలో గల పవన్ సాయి హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేర్చడం జరిగింది. 87వ వార్డు కార్పొరేటర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిచారు. చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని అధైర్య పడవద్దని అన్నారు. పరామర్శించిన వారిలో వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజాన్న రాజు, వార్డు అభివృద్ధి కమిటీ చైర్మన్ విజయరామరాజు, 87వ వార్డు ఎస్సీ సెల్ అధ్యక్షుడు జాన్ రమేష్, సీనియర్ నాయకులు భాస్కర్, దాలయ్య, ఏటీఎం మూర్తి, సూరిబాబు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోర్టు, సెమ్స్ సహకారంతో
నిరుద్యోగ యువతకు శిక్షణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నిరుద్యోగ యువతకు ఆధునిక సాఫ్ట్‌వేర్, హార్డ్ వేర్ సాంకేతిక అంశాలపై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారీటైం అండ్ షిప్ బిల్డింగ్ (సెమ్స్), విశాఖపట్నం పోర్టు అథారిటీ సంయుక్తంగా శిక్షణను ఇస్తున్నాయి. ఇందులో భాగంగా వేర్ హౌస్ ఎగ్జిక్యూటివ్, వేర్ హౌస్ పిక్కర్ వంటి విభాగాలలో శిక్షణను ఇచ్చారు. మొదటి విడతగా మహిళా సాధికారతను దృష్టిలో ఉంచుకుని గత మే నెలలో 25 మంది విద్యార్థినులకు ఇన్‌వెంటరి కంట్రోలర్ కోర్సులో 60 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. వీరిలో 17 మందికి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ప్రసిద్ధి చెందిన పరిశ్రమలలో ఉపాధిని పొందారు. ఇక తాజాగా రెండు, మూడు బ్యాచ్‌లలో 50 మందికి శిక్షణ ఇవ్వగా 40 మంది హైదరాబాద్, చెన్నైలలో ప్రముఖ సంస్థలలో ఉపాధి పొందారు. ఈ సందర్భంగా కోర్సు పూర్తి చేసుకుని ఉపాధి పొందిన విద్యార్థినులను పోర్టు చైర్ పర్సన్ ప్రశంసించారు. వారందరికీ పోర్టు చైర్ పర్సన్ డా ఎం.అంగముత్తు అపాయింట్‌మెంట్ సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలని తద్వారా సమీప పట్టణాల్లో ఉపాధి పొందేలా కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు సానుకూలంగా ఆలోచించి అవకాశాలను అందిపుచ్చుకోవడంతోపాటు

సంస్థకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. సెమ్స్ విభాగాధిపతి మాట్లాడుతూ కోర్సు పూర్తి చేసిన 50 మందిలో 40 మంది హైదరాబాద్, చెన్నైలలోని పేరున్న సంస్థల్లో ఉపాధిని పొందారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పోర్టు డెప్యూటీ చైర్ పర్సన్ దుర్గేష్ కుమార్ దూబే, పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, విభాగాధిపతులు, సీనియర్ అధికారులు, సెమ్స్ అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

కలకత్తా ఘటనపై నర్సింగ్ విద్యార్థుల ఆందోళన

విశాలాంధ్ర - పెందుర్తి: కలకత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన

హత్యోదంతంపై మండలంలోని పినగాడి నాలుగు రోడ్ల కూడలిలో విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. మహాత్మా బీఎస్సీ నర్సింగ్ కాలేజీ విద్యార్థిని, విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టి మానవహారం నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ పెందుర్తి నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రామునాయుడు, విశాఖ జిల్లా కార్యదర్శి నాదెళ్ల జ్యోతి, ఎమ్మార్పీఎస్ నాయకులు సామ్రాట్ పాల్గొన్నారు.

ఫ్రీ మాన్సూన్ డ్రై సోయింగ్‌తో భూసారం వృద్ధి

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం కోరాడ గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహన్‌రావు రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఫ్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పిఎండి) వల్ల మామిడి, జీడి మామిడి తోటలో ఉన్న భూముల్లో భూసారం పెరుగుతుందని వారన్నారు. పిఎండిఎస్ కింద పెసర, రాగులు, గంటి, మినప వంటి 30 రకాల విత్తనాలు మామిడి, జీడి మామిడి తోటల్లో వేస్తున్నట్లు తెలిపారు. ఈ అంతర పంటలు వేసుకోవడం వల్ల రైతులకు ఆర్థికంగా లాభమే కాకుండా భూసారం కూడా పెరిగి ఏళ్లపాటు దుక్కుతున్నకుండా వదిలేసిన ఈ తోటలో ఉన్న భూముల్లో భూసారం కూడా పెరుగుతుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కోరాడ గ్రామంలో 10 ఎకరాల మామిడి తోటలో 30 రకాల విత్తనాలను జల్లారు. ఈ కార్యక్రమంలో పకృతి వ్యవసాయం ఆర్టిఎల్ హేమ సుందర్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సెబీ కుంభకోణంపై దర్యాప్తు జరపాలి: కాంగ్రెస్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సెబీ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో దర్యాప్తు జరపాలని సెబీ చైర్మన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. గురువారం ఇసుకతోట కూడలిలోని ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు ధర్నా నిర్వహించారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు ఏఐసీసీ ఉపాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, భావి ప్రధాని రాహుల్ గాంధీ, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపుమేరకు నిరసన కార్యక్రమం చేపట్టినట్టు విశాఖ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్జిపర్తి శ్రీనివాసరావు తెలిపారు. సెబీ కుంభకోణంపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి జె.డి.శీలం, మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి, కిల్లి రామమోహనరావు, ఎపిసిసి జనరల్ సెక్రటరీ గుత్తుల శ్రీనివాసరావు, గదం మహేష్, శ్రీకాకుళం డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు, విజయనగరం డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్, సిటీ ప్రెసిడెంట్ సతీష్, హసిన్ వర్మ, స్టేట్ బి.సి. సెల్ అధ్యక్షులు మూల వెంకటరావు, స్టేట్ యూత్ కాంగ్రెస్ అధ్యకులు లక్కరాజు రామారావు, కెవి సూర్యనారాయణ, సోదాదాసు సుధాకర్, అరుకు అధ్యక్షులు శాంత కుమారి, ఏపిసిసి స్పోక్స్ పర్సన్ దండి ప్రియాంక, భాస్కర్, వెంకటేష్, త్రినాధరావు, కనకరాజు, యూత్ కాంగ్రెస్ సతీష్, శివ, వల్లయ్య , తదితర నాయకులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర - పద్మనాభం: రెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో మీకు తెలుసా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లింక్ వర్కర్ స్కీమ్ సూపర్‌వైజర్ టి.చంద్రశేఖర్ మాట్లాడుతూ హెచ్.ఐ.వి. లైంగికంగా సంక్రమించే అంటువ్యాధుల గురించి సమా చారాన్ని విద్యార్థులకు, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు 2 నెలల పాటు మీకు తెలుసా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. హెచ్ఐవి సుఖవ్యాధులు, హెచ్.ఐ.వి. ఉన్నవారి పట్ల వివక్ష తగ్గించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించారు. తద్వారా ఎక్కువ మంది హెచ్.ఐ.వి. పరీక్షలు చేసుకునేందుకు ముందుకొచ్చేలా హెచ్ఐవి ఎయిడ్స్ (ప్రివెన్షన్ కంట్రోల్) యాక్టు -2017 గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సన్యాసిరావు, హైస్కూల్ సిబ్బంది హెల్త్ స్టాఫ్ సి.హెచ్.ఓ. ఎం.దివ్య, ఏఎన్ఎం భాగ్య లక్ష్మి, ఆశ వర్కర్స్, సచివాలయం గ్రామ సచివాలయ సిబ్బంది, లింక్ వర్కర్ ఎం.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉదయ్ శంకర్‌కు సన్మానం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల రక్షణ మండలి ప్రధాన కార్యదర్శి మామిడి ఉదయ శంకర్‌ను గురువారం మండల నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల సమస్యలను పరిష్కారానికి సమర్థవంతంగా కృషి చేస్తానని, నాయకులు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పాలవలస ఎంపీటీసీ రౌతు వెంకట్రావు, టిడిపి గ్రామ ప్రెసిడెంట్ నిమ్మల అప్పలరాజు, భీమిలి వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ రౌతు శ్రీను, టిడిపి నాయకులు సుంకరి బంగారం నాయుడు, కంచి బోయిన తమ్ము నాయుడు, చందక శంకర్, బంటుబిల్లి సాయి, తదితర నాయకులు పాల్గొన్నారు.

భూగర్భ మురుగు నీటి కాలువలలో మనుషులు దిగి పరిశుభ్రం చేయొద్దు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలో గల ఏ ప్రాంతంలోనైనా భూగర్భ మురుగు నీటిపారుదల వ్యవస్థకు సంబంధించి భూగర్భ మురుగునీటి కాలువలల్లో (అండర్ గ్రౌండ్ డ్రైనేజీలలో) ఎవరూ కూడా దిగి ఎటువంటి పరిశుభ్రతా చర్యలు చేపట్టరాదని, భూగర్భ మురుగునీటి పారుదల కాలువలలో మనుషులు దిగి మాన్యువల్‌గా పరిశుభ్రం చేసే పనులను నిషేధించడ మైనదని, జీవీఎంసీకి సంబంధించిన మిషనరీతోనే అధికారిక అనుమతితోనే భూగర్భ నీటి కాలువలను శుభ్రపరచడం జరుగుతుందని జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్.నరేష్ కుమార్ గురువారం నగర ప్రజలకు తెలిపారు. జీవీఎంసీ పరిధిలో గల భూగర్భ మురుగునీటిపారుదల కాలువలలోనికి ఎవరైనా దిగినట్లుగా, పరిశుభ్రం చేస్తున్నట్లుగా గమనించినా, గుర్తించినా వెంటనే జీవీఎంసీ టోల్ ఫ్రీ 1800 4250 0009 నెంబర్‌నకు ఫోన్ చేసి తెలియపరచవలసినదిగా విశాఖ నగర ప్రజలకు కమిషనర్ తరపున ప్రధాన వైద్యాధికారి విజ్ఞప్తి చేశారు.

జై జవాన్ ఫౌండేషన్ ఆర్థికసాయం

విశాలాంధ్ర - ఆనందపురం: నెలరోజులు క్రితం విజయనగరం జిల్లా జొన్నాడ గ్రామం వద్ద పదిమంది గీత కార్మికులతో వెళ్తున్న వ్యాన్ బోల్తా పడి అందులో ఇద్దరు వ్యక్తులు చనిపోగా మిగిలిన వాళ్ళకి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిలో దాకమర్రి గ్రామానికి చెందిన గొంప బంగారయ్య కోమాలోకి వెళ్లడంతో విజయనగరంలో ఒక ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. అయితే రోజుకి 20 వేలు చొప్పున ఆసుపత్రిలో వైద్య ఖర్చులు అవుతున్నాయి. దీనికి స్పందించిన జై జవాన్ ఫౌండేషన్ సభ్యులు కొంతమంది వద్ద నుంచి 14 వేల రూపాయలను సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జై జవాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుప్ప రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను, కోశాధికారి కుప్పరామలక్ష్మి, కుప్ప అప్పారావు, కుప్ప శ్రీను, చుక్క గణేష్, కుప్ప ఆనంద్, కార్తీక్, మెరుగు రాము తదితరులు పాల్గొన్నారు.

ఎసెన్షియా ఫార్మా కంపెనీని
పరిశీలించిన సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర - రాంబిల్లి: అచ్యుతాపురం సెజ్ లో ఎసెన్షియా ఫార్మా ప్రమాద ఘటనాస్థలిని సీఎం చంద్రబాబు గురువారం పరిశీలించారు. అనంతరము జిల్లా అధికారులు, మంత్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ఎసెన్షియా అడ్వాన్స్ డ్ సైన్సెస్ ఫార్మా కంపెనీలి రెడ్ కేటగిరీలో ఉండే కంపెనీ. 17 మంది చనిపోవడం, ఒకరికైతే 54 శాతం, మరొకరికి 24 శాతం, ఇంకొకరికి 17 శాతం, ఇంకొకరికి 10 శాతం కాలిన గాయాలయ్యాయని, మిగిలినవారికి స్వల్ప గాయాలయ్యాయని, నేను మొదట.. తీవ్రంగా గాయపడినవారిని పరామర్శించానన్నారు. ఆ తర్వాత కేజీహెచ్ కి వెళ్లి చనిపోయిన వారి కుటుంబ సభ్యులతో మాట్లాడానని, సంఘటనలు చూసి చాలా బాధేస్తోందన్నారు. ఒక యువతి 4 నెలల ప్రెగ్నెంట్ వారికి ఒక బాబు కూడా ఉన్నారని, పెళ్లి జరిగి రెండేళ్లు కూడా కాలేదని, కానీ అతను చనిపోయాడన్నారు. ఆ అమ్మాయిని చూస్తే చాలా బాధేస్తుందన్నారు. అవి చూసిన తర్వాత వాళ్లందరితో మాట్లాడి ఒక భరోసా ఇచ్చామన్నారు. చనిపోయినవాళ్లు ఒక్కొక్కరికీ రూ.కోటి ఆర్థికసాయం చేయడం, తీవ్ర గాయాలైనవారికి రూ.50 లక్షలు ఇవ్వడం, స్వల్పంగా గాయపడినవారికి రూ.25 లక్షలు ఇవ్వడం.. ఈ మూడు కేటగిరీల కింద ప్రకటన చేశాం. అయితే మనం ఆర్థికసాయం చేయొచ్చు కానీ కుటుంబాలను తీసుకురాలేము. చనిపోయినవారిని తీసుకురాలేము. అది వారికి జీవితాంతం తీరని అని అన్నారు. ఒకపక్క ఇండస్ట్రీస్ రావాలి.. రెండోపక్కన కూడా సేఫ్టీకి కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలని, ఎవరైనాసరే ప్రాపర్ ఎస్వోపీ ఫాలో అయితే ఈ ప్రాబ్లమ్ వచ్చేది కాదన్నారు. ఎల్జీ పాలిమర్స్ ఘటన జరిగినప్పుడు ఒక హైపవర్ కమిటీ వేశారు. నామమాత్రంగా ఆర్డర్స్ ఇష్యూ చేశారని, ఎగ్జిక్యూషన్ జీరో అని, అందువల్ల ఈ పరిస్థితి వచ్చిందని, జీవో 156 ఒకటి రిలీజ్ చేశారని, కాకినాడలో ఒక సంఘటన జరిగితే అప్పుడు కూడా జీవో 79 రిలీజ్ చేశారని, కానీ రెగ్యులారిటీ అథారిటీస్ మాత్రం నామమాత్రంగా చర్యలు తీసుకున్నారు తప్ప ఎక్కడా యాక్షన్ తీసుకోలేదన్నారు. దానివల్ల రిపీటెడ్‌గా జరుగుతున్నాయన్నారు. ఏది ఏమైనా దీనిపై డిటైల్స్ ఎప్పటికప్పుడు చెప్తాం. ఫర్మ్ యాక్షన్ తీసుకుంటే తప్ప ఇక్కడ ఇవన్నీ ఫుల్ స్టాప్ పెట్టలేమన్నారు. రెడ్ కేటగిరీలో ఉండే ఇండస్ట్రీస్ అన్నీ మీరు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభుత్వానికి కానీ, ప్రజలకు కానీ ఇండస్ట్రీస్ రావాలి, ఎంప్లాయిమెంట్ కావాలి, వెల్త్ క్రియేట్ చేయాలి. అదే సమయంలో ప్రజల సేఫ్టీ కూడా ఈక్వల్ ఇంపార్టెన్స్ ఇవ్వాలన్నారు. అందుకే అందరు పారిశ్రామికవేత్తలకు ఈ మీటింగ్ ద్వారా పిలుపిస్తున్నామని, తక్షణమే సేఫ్టీ మెజర్స్ అన్నీ మీరు ఇంటర్నల్ ఆడిట్ చేయాలని, ఇంటర్నల్ ఆడిట్ చేసుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రమాద బాధిత కుటుంబాలను పూర్తిగా ఆదుకునే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, అదేమాదిరిగా మేనేజ్మెంట్నే పే చేయమంటున్నాం నష్టపరిహారం వరకు. మేనేజ్మెంటే పే చేస్తారని, అది వాళ్లే ఇప్పటికే పే చేయించారన్నారు. రూ.కోటి అయితే వాళ్లే చెక్కులిచ్చారన్నారు. మొత్తం వాళ్లే ఇస్తున్నారన్నారు. విశాఖపట్నంలో పరవాడ దగ్గర ఇంకొక ఫార్మా ఉందని, ఇక్కడ అచ్యుతాపురంలో ఒక ఫార్మా ఉందని, మోడల్స్ కూడా ఉన్నాయని, అక్కడ డెవలపర్ ఉన్నారని, ఇక్కడ ఏపీఐఐసీ ఉందన్నారు. 2020లో జరిగిన ఎల్జీ పాలిమర్స్ ఘటనలో 12 మంది చనిపోయారని, 2020లోనే హిందుస్థాన్ షిప్యార్డులో జరిగిన ఘటనలో 11 మంది చనిపోయారని, లారస్ లో కూడా ఒక యాక్సిడెంట్ జరిగిందని, అది జరిగాక ఇప్పుడు జరిగిన ఇన్సిడెంట్ జరిగిందిదన్నారు. ప్రతి 3 నెలలకు ఒకసారి ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఇక్కడ కావాల్సినటువంటి ట్రామా సెంటర్ కానీ, బర్న్ యూనిట్ వంటి హాస్పిటల్ తో పాటు ఫైర్ స్టేషన్ కూడా రావాల్సి ఉందన్నారు. కార్మికులకు ఏదైనా జరిగితే ఫస్ట్ ఎయిడ్ ఇవ్వడానికి వంటి చర్యలు తీసుకోవాల్సి ఉంది అవన్నీ కూడా చేస్తామన్నారు.

పది ఏఐ వాషింగ్ మెషీన్‌ల శ్రేణిని ప్రారంభించనున్న శామ్‌సంగ్

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్ ఈ సంవత్సరం పండుగ సీజన్‌కు ముందు 10 వాషింగ్ మెషీన్‌లను పరిచయం చేయబోతున్నట్లు ప్రకటిం చింది. కంపెనీ ఈ నెలాఖరులో విడుదల చేయబోతున్న దాని రాబోయే ఫ్రంట్-లోడ్ ఏఐ పవర్డ్ వాషింగ్ మెషీన్ కోసం ఇటీవల టీజర్‌ను విడుదల చేసింది. కంపెనీ యొక్క హై-ఎండ్ బెస్పోక్ ఏఐ సిరీస్ గృహోపకరణాలు, మెరుగైన కనెక్టివిటీని, స్మార్ట్ హోమ్ అనుభవాన్ని మార్చడానికి సిద్ధంగా ఉన్న తెలివైన వినియోగదారు-స్నేహపూర్వక పరిష్కారాలతో అనుకూలమైన అనుభవాలను అందిస్తాయి, తాజా ఏఐ ఆధారిత వాషింగ్ మెషీన్‌లు ఉన్నాయి. ఈ ఉపకరణాలు భారతీయ వినియోగదారుల కోసం రూపొందించబడ్డాయి.

మంచి సినిమాలకు ప్రోత్సాహం ఉంటుంది

- పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: మంచి సినిమాలకు ఎల్లప్పుడూ ప్రోత్సాహం ఉంటుందని పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం నోవాటల్‌లో "మన్యం ధీరుడు" సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చలన చిత్ర రంగంలో తెలుగు సినిమాకు ప్రత్యేక స్థానాన్ని సంపాదిందన్నారు. విశాఖ సినిమా నిర్మాణానికి అనువైన సహజ సుందరమైన నగరమన్నారు. ఒక త్రిబుల్ ఆర్, ఒక బాహుబలి, ఒక మగధీర రేంజ్ లో మన్యం ధీరుడు చిత్రం కూడా ఘనవిజయం సాధిస్తుందని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. తన మిత్రుడు నగరానికి చెందిన ఆర్.వి.వి.సత్యనారాయణ నిర్మించిన చిత్రం అల్లూరి సీతారామరాజు చరిత్రను ప్రతిభందిస్తుందన్నారు. మంచి చిత్రాలకి ఆదరణ ఎప్పుడూ ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి సినిమాలను ప్రోత్సహించి రాయితీలు ఇవ్వాలని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ను రామ్ కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో మన్యం ధీరుడు నిర్మాత, హీరో ఆర్.వి.వి.సత్య నారాయణ, జనసేన డాక్టర్ సెల్ చైర్మన్ బొడ్డేపల్లి రఘు, తెలుగు శక్తి యువత అభివృద్ధి సలహాదారు వి.వంశీ బాబు తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి జీ తెలుగులో ఆదివారమూ సీరియల్స్

విశాలాంధ్ర - విశాఖపట్నం: జీ తెలుగులో ప్రేక్షకుల ఆదరాభి మానాలతో విజయవంతంగా కొనసాగుతున్న సీరియల్స్ ని ఇక నుంచి ఆదివారం కూడా సిద్ధమైందనీ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి శనివారం వరకు సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు ప్రసారమయ్యే సీరియల్స్ అన్నీ ఈ నెల 25 నుంచి ఆదివారం కూడా ప్రసారం అవుతాయన్నారు. చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి, మా అన్నయ్య, నిండు నూరేళ్ళ సావాసం, మేఘసందేశం, పడమటి సంధ్యారాగం, త్రినయని సీరియల్స్ ఇకనుంచి ఆదివారం కూడా తమ అభిమానులను అలరిస్తాయన్నారు. చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి సాయంత్రం 6 గంటలకు, మా అన్నయ్య 6:30 గంటలకు, నిండు నూరేళ్ళ సావాసం రాత్రి 7 గంటలకు, మేఘసందేశం 7:30 గంటలకు, పడమటి సంధ్యారాగం 8 గంటలకు, త్రినయని 8:30 గంటలకు ప్రసారం కానున్నాయన్నారు.

మధ్యాహ్నం సీరియల్స్ మాత్రం యథాతథంగా సోమవారం నుంచి శనివారం వరకు వాటి సమయాల్లో ప్రసారమై ప్రేక్షకులను అలరిస్తాయన్నారు. ఈ నాన్ స్టాప్ సీరియల్ ట్రీట్‌తో పాటు ఈ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బ్లాక్ బస్టర్ హిట్ పిండం వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ ను కూడా అందిస్తోందన్నారు.

24న అనకాపల్లి జోన్‌లో తాగునీటికి అంతరాయం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ 7వ జోన్ అనకాపల్లి పరిధిలో జీవీఎంసీ అమృత్ 2.0 లో భాగంగా తాగు నీటి సరఫరా మెరుగుపరుచుటకు గాను ఈనెల 24వ తేదీ శనివారం అనకాపల్లి జోన్‌లో తాగు నీటికి అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజినీరు శేఖర్ తెలియజేశారు. జీవీఎంసీ అమృత్ ప్రాజెక్టు 2.0లో తాగునీటి సరఫరా మెరుగుపరచుటకు పి.ఎస్.సి పైపులైన్ల స్థానంలో 500 ఎంఎం వ్యాసార్థం కలిగిన డి.ఐ పైపులైన్లను వున్న పైపులైన్లకు అనుసందానం చేయడం జరుగుతుందన్నారు. అందువలన ఆగస్టు 24వ తేదీ శనివారం అనకాపల్లి (తుంపాల) హెడ్ వాటర్ వర్క్స్ నుండి ప్రస్తుతం ఉన్న పి.ఎస్.సి పైప్ లైన్ల ద్వారా తాగు నీరు సరఫరా చేయు అనకాపల్లి ప్రాంతమంతా త్రాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. తాగునీరు సరఫరా అంతరాయమునకు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయబడునని ఆయన తెలిపారు. కావున ప్రజలకు తాగునీటికీ కలుగు అసౌకర్యానికి చింతిస్తూ మంచినీటి సరఫరా విభాగము జీవీఎంసీ వారికి అనకాపల్లి ప్రాంత ప్రజలు సహకరించవలసినదిగా కమిషనర్ వారి తరుపున కోరుచున్నామని కార్యనిర్వాహక ఇంజినీరు తెలియజేశారు. అత్యవసరం అయినచో నీటి ట్యాంకర్లు కొరకు నీటి సరఫరా సహాయక ఇంజినీర్లను ఈ ఫోన్ నెంబర్లులో 8247066778, 8978486139 సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.

దుర్గాదేవి ఆలయానికి తలుపులు సమకూర్చిన అశోక్

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి బీసీ కాలనీలో గల శ్రీ దుర్గాదేవి ఆలయానికి ఆ ప్రాంతానికి చెందిన కోయిలాడ అశోక్ దంపతులు ఖరీదైన టేకు తలుపులు సమకూర్చారు. సుందరంగా రూపొందించిన తలుపులను ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అశోక కుటుంబ సభ్యులతో పాటు బిసి కాలనీ ప్రముఖులు శరగడం రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

క్రెడిట్ ఫస్ట్ యూపీఐ యాప్‌ను ప్రారంభించిన సూపర్ డాట్ మనీ

విశాలాంధ్ర - విశాఖపట్నం: క్రెడిట్ ఫస్ట్ యూపీఐ యాప్‌ను సూపర్ డాట్ మనీ ప్రారంభించింది. బీటా దశలో 10 సూపర్.మనీ, క్రెడిట్-ఫస్ట్ యూపీఐ సర్వీస్ ప్లాట్‌ఫారమ్, విజయవంతమైన బీటా దశ తర్వాత ఈరోజు అధికారికంగా తన యాప్‌ను ప్రారంభించిందని ఆ సంస్థ ప్రతినిధి ప్రకాష్ సికారియా చెప్పారు. బీటా దశలో, యాప్ దాదాపు ఒక మిలియన్ డౌన్‌లోడ్‌లను చూసింది, 10 మిలియన్లకు పైగా లావా దేవీలను నడిపింది, యాప్ యొక్క గణనీయమైన స్వీకరణను ప్రదర్శిస్తుందన్నారు. సూపర్ డాట్ మనీ కూడా యూపీఐ సొల్యూషన్‌పై క్రెడిట్ యొక్క మొదటి రకమైన పరీక్షను పూర్తి చేసిందన్నారు. దాని కోసం వెయిట్‌లిస్ట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించిందని, సూపర్.మనీ యొక్క మొదటి పరిష్కారం రూపే క్రెడిట్ కార్డ్, ఇది యూపీఐ పట్టాలపై వడ్డీని కలిగి ఉండే వాలెట్ లాగా పనిచేస్తుందన్నారు.

దుర్గా భవాని అమ్మవారి వార్షికోత్సవం

విశాలాంధ్ర - ఆనందపురం: ప్రతి ఏడాది ఘనంగా నిర్వహించే శ్రీ జయ దుర్గ భవాని అమ్మవారి ఆలయ 6వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలంలో ఆనందపురం గ్రామపంచాయతీ పరిధిలో ఎస్సీ, బీసీ కాలనీలో ప్రతీఏటా ఘనంగా నిర్వహిస్తారు. మూడు రోజులు పాటు నిర్వహించే ఈనెల 24 వరకు అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని, అమ్మవారి ఊరేగింపుతో పాటు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. మూడో రోజు శనివారం సుమారు 2వేలు మంది భక్తులకు అన్న సమాధారాధన కార్యక్రమం ఏర్పాటు చేస్తామని భక్తులందరూ విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తారని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - ఆనందపురం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జోన్ 3 పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆనందపురం సబ్ స్టేషన్ 11 కె వి, గంభీరం 11 కెవి మరమ్మత్తులు నిమిత్తం మండలంలో దుక్కవానిపాలెం, ఈగలవానిపాలెం, పాలవలస, మెట్ట మీద పాలెం, తర్లు వాడ, నగరపు పాలెం, గుడిలోవ, పెద్దిపాలెం, వల్లిపేట పొడుగు పాలెం ,చందక, కుసులవాడ, జగన్నాథపురం, గొట్టిపల్లి, వెంకటాపురం, తదితర గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేయబడుతుందని ఏఈ సురేష్ కుమార్ తెలిపారు.

సీఎం విశాఖ పర్యటన దృశ్యాలు